సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 15 । మార్చి । 2024



కిడ్నీ ఆస్పత్రి ఓ వరం

పలాస కిడ్నీ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. ఆస్పత్రి పనితీరు వివరించారు. - 10లో



ఏసీబీ వలలో..

ఏసీబీ వలలో ఓ సచివాలయ ఉద్యోగి చిక్కు కున్నాడు. తోటి గిరిజనుడి వద్ద లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. - 10లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర	శని
సాయంత్రం	ఉదయం
6.08	4.47

న్యూస్‌రీల్

16న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ నెల 16వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతోందని, ఆ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలో ఉన్న అన్ని కోర్టుల్లోనూ అదాలత్ జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీఆర్‌ఓ సస్పెన్షన్

శ్రీకాకుళం: కొత్తూరు మండలం, దిమిలి గ్రామం వీఆర్వోగా పని చేస్తున్న కె.రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు విచారణలో తేలడంతో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు.

అరసవల్లి ఈఓ బాధ్యతల స్వీకరణ



డీసీ చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, గోవిందరావు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయానికి కొత్త కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ డిప్యూటీ ఈఓగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను అరసవల్లి ఆలయ ఈఓ(డి.సి)గానూ, అరసవల్లిలో ఈఓగా పనిచేసిన డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబును అన్నవరం సత్యనారాయణ స్వామి వారి ఆలయ డిప్యూటీ ఈఓగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. కొత్త ఈఓ చంద్రశేఖర్‌కు ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావులు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి, అనంతరం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఆలయ సూపరింటిండెంట్ కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది కొత్త ఈఓను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● అభినందన



మంత్రి అప్పలరాజుకు ఓ హృద్యమైన అనుభవం ఎదురైంది. ఆయన గురువారం మందస మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించగా.. స్థానికంగా చేసిన అభివృద్ధి పనులకు గాను ఓ కార్యకర్త ఇలా భుజాలపై ఎత్తుకున్నారు. - మందస

● ఆందోళన



తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారణమైన వారికి పట్టుకుని శిక్షించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ డిమాండ్ చేశారు. సోంపేటలో స్థానిక నాయకులతో కలిసి ఇలా ర్యాలీ నిర్వహించారు. - సోంపేట

● ఆలంబన



రణస్థలం చిన్నకొవ్వాడకు చెందిన మైలపల్లి సత్యం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో వాలీబాల్‌లో బెస్ట్ టాలెంటెడ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. దీంతో ప్రభుత్వం అతనికి రూ.10 లక్షలు అందించింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ చెక్కును అందిస్తూ అభినందించారు. - శ్రీకాకుళం రూరల్

సీటు.. హీటు



- టీడీపీలో కల్లోలం
- పొత్తులో శ్రీకాకుళం సీటు బీజేపీకి కేటాయిస్తున్నారని లీకులు
- ఎచ్చెర్లలో ఆందోళనలో కళా వర్గీయులు
- రెండో జాబితాలో ప్రకటించకుండా సీనియర్‌ను అవమానపరిచారని మండిపాటు
- అధిష్టానం నిర్ణయం తీసుకోకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేసే అవకాశం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం టీడీపీలో కల్లోలం మొదలైంది. టిక్కెట్ల విషయంలో క్లారిటీ ఇవ్వకపోవడంతో కార్యకర్తల్లో ఆందోళన పెరుగుతోంది. శ్రీకాకుళం సీటును బీజేపీకి కేటాయిస్తున్నట్టుగా, ఎచ్చెర్లలో కళా వెంకటరావును కాదని ఆలోచన చేస్తున్నారనే ఊహాగానాలతో ప్రకంపనలు మొదలయ్యాయి. ఇప్పటికే చంద్రబాబుతో తేల్చుకుంటామని ఎచ్చెర్ల టీడీపీ నాయకులు అల్టిమేటం జారీ చేయడమే కాకుండా అవసరమైతే రాజీనామాలకు సిద్ధమని సంకేతాలు పంపించారు. శ్రీకాకుళం టీడీపీ నాయకులు వేచి చూసే ధోరణిలో గుర్రుగా ఉన్నారు.

కళాకు అవమానం..

పార్టీలో సీనియర్ అయినా కిమిడి కళా వెంకటరావును పార్టీ అధిష్టానం అవమాన పరుస్తోందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికే టిక్కెట్ల ఖరారుకు సంబంధించి రెండు జాబితాలు ప్రకటించారు. అందులో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుకు చోటు దక్కలేదు. ఇక్కడ కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు మధ్య గట్టి పోటీ ఉంది. దీంతో టిక్కెట్ విషయంలో అధిష్టానం తేల్చుకోలేకపోతోంది. డబ్బు విషయం తేలకపోవడంతో ఎచ్చెర్ల టిక్కెట్ ఖరారు చేయకుండా అధిష్టానం జాప్యం చేస్తోంది. ఇదంతా చూస్తుంటే తమ నాయకుడికి మొండి చేయి చూపించేలా ఉందని కళా వెంకటరావు వర్గీయుల్లో ఆందోళన మొదలైంది.

శ్రీకాకుళంలో బీజేపీ కల్లోలం

శ్రీకాకుళం నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయిస్తున్నట్టుగా టీడీపీ అధిష్టానం లీకులిచ్చింది. టీడీపీలో రెండు గ్రూపులు గట్టిగా పోటీ పడుతుండటంతో ఎందుకొచ్చిన గొడవని బీజేపీకి ఇచ్చేస్తే సరిపోతుందనే దృష్టితో టీడీపీ నిర్ణయానికి వచ్చినట్టుగా లీకుల సంకేతాలిచ్చింది. ఇది బీజేపీ నాయకులను కుదిపేసింది. బీజేపీలో ఉన్న టీడీపీ కోవర్టుగా ఆరో పణలున్న సీఎం రమేష్ అనుచరుడు సురేంద్రమోహన్ పేరు తెరపైకి రావడాన్ని స్థానిక బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తిరుపతి జిల్లాలో ని శ్రీకాళహస్తికి చెందిన ఈయన గత కొన్నేళ్లుగా విశాఖపట్నంలో ఉంటున్నారు. బీజేపీ యువ మోర్చా నాయకుడిగా, రాష్ట్ర పార్టీ నాయకుడిగా కొనసాగుతూ సీఎం రమేష్ వ్యవహారాలు నడుపుతున్న వ్యక్తిగా పార్టీలో చెప్పుకుంటున్నారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ఆయనకు పొత్తులో భాగంగా శ్రీకాకుళం అసెంబ్లీ కేటాయిస్తున్నట్టుగా ప్రచారానికి తెరలేపారు. వాస్తవంగా జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయిస్తారని పార్టీలో చర్చ జరుగుతోంది. అది ఎచ్చెర్ల లేదా శ్రీకాకుళం కావచ్చని భావించారు. ఈ నేపథ్యంలో పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ, అంచనాలకు, ఊహాగానాలకు భి న్నంగా సీఎం రమేష్ అనుచరుడైన సురేంద్ర కుమా ర్ పేరు ప్రతిపాదనలోకి వచ్చిందని ఎల్లోమీడియా ద్వారా లీకులివ్వడం బీజేపీలో కలకలం రేగింది. ఎక్కడో ఉన్న నాయకుడు ఇక్కడొచ్చి పోటీ చేయడమేంటని బీజేపీ శ్రేణులు మల్లగుల్లాలు పడుతున్న పరిస్థితి నెలకుంది. ఇదే జరిగితే పొత్తు ధర్మంలో మిగతా పార్టీలు సహకరిస్తాయో లేదో తెలియదు గాని బీజేపీ శ్రేణులే పనిచేయవని ఆ పార్టీ నాయకులు చెప్పకనే చెబుతున్నారు. ఒకవైపు సమీకరణాల కోసం మాట్లాడుతూనే మరోవైపు టీడీపీ అధిష్టానం ఆడుతున్న డ్రామాలో భాగమే ఇదంతా అని అదే బీజేపీ నాయకులు కొట్టి పారేస్తున్నారు. బీజేపీకి వెళ్లిపోతే ఇబ్బందని టీడీపీలో ఎవరో ఒకరు వెనక్కి తగ్గుతారనే అభిప్రాయంతో ఈ లీకులు ఇ చ్చి ఉండొచ్చని టీడీపీ నాయకులు భావిస్తున్నారు.

చంద్రబాబుకు అల్టిమేటం

టికెట్ విషయం తేడా కొడుతున్నట్టు ఉందని, బయటికి రాకపోతే నష్టపోయేలా ఉన్నామని భావించి కళా వెంకటరావు వర్గీయులు గురువారం మధ్యాహ్నం రోడ్డెక్కారు. పార్టీలో తూర్పు కాపులకు పెద్ద దిక్కైన కళా వెంకటరావును పార్టీ అవమాన పరుస్తోందని మండిపడుతున్నారు. పత్రికా సమావేశం పెట్టి తమ డిమాండ్‌ను తెలియజేశారు. శుక్రవారంలోగా అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే చంద్రబాబు వద్దకు వెళ్లి తేల్చుకుంటామని అల్టిమేటం జారీ చేశారు. అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం సిద్ధమంటూ సంకేతాలు పంపించారు. ఇప్పుడిది ఎచ్చెర్ల టీడీపీలో కలకలం రేపింది. కళాకు తేడా కొడుతున్నందున ఆయన వర్గీయులంతా బయటికొచ్చారని, పార్టీలో ఏదో జరుగుతుందనే అనుమానం వారిలో మొదలైంది. మరోవైపు కలిశెట్టి అప్పలనాయుడు వర్గమంతా టిక్కెట్ తమకే వస్తుందని ధీమాలో ఉంది.

పొలిటికల్ టాక్

16న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18–35 ఏళ్ల మధ్య వారు అర్హులని తెలిపారు. విశాఖపట్నంలో పనిచేసేందుకు ముత్తూట్ ఫైనాన్స్ ఉద్యోగాలకు పురుష అభ్యర్థులు డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ అర్హత ఉన్నవారు అర్హులు కాగా, నెలకు వేతనం రూ. 17000 నుంచి రూ. 21000 మధ్య ఉంటుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నంలో పనిచేసేందుకు అపోలో ఫార్మశీకి 10వ తరగతి, డిగ్రీ, బి.ఫార్మశీ, డి.ఫార్మశీ, ఎం.ఫార్మశీ ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని వివరించారు. విద్యార్హత బట్టి వేతనం రూ. 10500 నుంచి రూ. 20,000 ఉంటుందని తెలిపారు.

అవినీతికి కేరాఫ్ టీడీపీ



మాట్లాడుతున్న పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో స్పీకర్ తమ్మినేని, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మజ్జి శ్రీనివాసరావు, పేరాడ తిలక్, దుంపల లక్ష్మణరావు, కిల్లికృపారాణి, ఎం.వి.పద్మావతి

- స్కిల్ డెవలప్‌మెంట్ కేసే అందుకు నిదర్శనం
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఆమదాలవలస: అవినీతికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని, చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలుకు వెళ్లడమే అందుకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన గురువారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ ముఖ్యనాయకులు బెండి గోవిందరావు, బొడ్డేపల్లి నారాయణరావు, తమ్మినేని శ్రీరామమూర్తి, ఖండాపు గోవిందరావు, కె.వి.జి. సత్యన్నారాయణ, సురవరపు నాగేశ్వరరావు, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, లోలుగు కాంతారావు, కొంచాడ రమణమూర్తిలతోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. పాతపట్నంలోనూ సమావేశం జరిగింది.

కార్యకర్తల పాత్ర కీలకం

కార్యకర్తలు క్రియా శీలక పాత్ర పోషిస్తే పార్టీ గెలుపు సులభమవుతుంది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలించిన వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం. - కిల్లి కృపారాణి, మాజీ కేంద్ర మంత్రి

తమ్మినేని గెలుపు ఖాయం


ఆమదాలవలసలో తమ్మినేని గెలుపు ఖాయం. ఇంటింటికీ వెళ్లి ఆయన సంక్షేమాన్ని వివరిస్తున్నారు. - ఎంపీ పద్మావతి

వైఎస్ జగన్ సింహం




రాష్ట్రంలో మూడు పార్టీలు ఏకమై దాడి చేస్తుంటే వైఎస్ జగన్ సింహంలా ముందుకు వెళ్తున్నారు. అవినీతి లేని పాలన అందించిన ఘనత వైఎస్ జగదే. నాయకులు, కార్యకర్తలు విభేదాలు వీడి ముందుకు సాగాలి. కూన రవికుమార్ ఇసుకాసురుడు. నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన చర్చకు రాగలరా. వెన్నెలవలసలో వండెకరాల అక్రమాలు, పురుషోత్తపురం వంశధారలో ఇసుక అక్రమ రవాణా గుర్తు లేవా అని ప్రశ్నించారు. ఎంతో మంది అధికారులపై కూడా ఆయన దాడులు చేశారు. నియోజకవర్గంలో ఎక్కడకు వెళ్లినా నేను చేసిన అభివృద్ధి కనిపిస్తుంది. - తమ్మినేని సీతారాం, స్పీకర్

జగన్‌ను గెలిపిద్దాం



రాష్ట్రంలో విశాల ప్రయోజనాల కోసం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించాలి. చంద్రబాబు ఒంటరిగా ఏనాడూ పోటీ చేయలేదు. వెన్నుపోట్లతోనే ఆయన సీఎం అయ్యారు. 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత మాదే. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలి. - ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

కష్టపడదాం..



ఐదేళ్లుగా ఎలాంటి ఆడంబరం లేకుండా సంక్షేమ పథకాలను వైఎస్ జగన్ అందించారు. ఐదేళ్ల కిందట ఎలా కష్టపడ్డామో మళ్లీ అలాగే కృషి చేసి పార్టీని గెలిపించాలి. ఈ ఎన్నికల్లో గెలిస్తే జనం మరో ఐదేళ్లు హాయిగా ఉంటారు. - మజ్జి శ్రీనివాసరావు, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్

పేట బగ్గుమంటోంది



- అచ్చెన్నకు ఝలక్ ఇచ్చిన లోకేష్
- నమ్మి మోసపోయిన టీడీపీ సీనియర్ నేత బగ్గు లక్ష్మణరావు
- తన కుమారుడు డాక్టర్ శ్రీనివాస్‌కు టిక్కెట్ వస్తుందని ఆశ చూపిన అధిష్టానం
- బగ్గు రమణమూర్తికి నరసన్నపేట టిక్కెట్ ఖరారు
- మండిపడుతున్న బగ్గు లక్ష్మణరావు వర్గీయులు


సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: నరసన్నపేట టిక్కెట్ విషయంలో అచ్చెన్నాయుడికి లోకేష్ పెద్ద ఝలక్కే ఇచ్చారు. ముఖ్యంగా అచ్చెన్నను నమ్ముకుని బగ్గు లక్ష్మణరావు తీవ్రంగా నష్టపోయారు. తన కుమారుడు డాక్టర్ శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తున్నామని చెప్పి నియోజకవర్గంలో పనిచేసుకోమని ఆదేశించి ఇప్పుడు మోసగించారని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికే మరోసారి టిక్కెట్ ఖరారు చేయడంతో బగ్గు లక్షణరావు వర్గీయులు కారాలు మిరియాలు నూరుతున్నారు.

మళ్లీ మోసం

నరసన్నటపేట టీడీపీ సీనియర్ నేత బగ్గు లక్ష్మణరావును టీడీపీ మరోసారి మోసగించింది. గతంలో కూడా టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. ఆ ఎన్నికల్లో కూడా బగ్గు లక్ష్మణరావు కూడా ప్రయత్నించారు. పార్టీలో సీనియర్‌నైన తనకు టిక్కెట్ ఇవ్వాలని కోరారు. కానీ చంద్రబాబు మొండి చేయి చూపించారు. ఈసారి కూడా టిక్కెట్ ఇస్తామని చంద్రబాబు ఆశ చూపించారు. యూత్ కోటాలో తన కుమారుడు బగ్గు శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తామని గత కొంతకాలంగా అన్నిరకాలుగా వాడుకున్నారు. తనకు టిక్కెట్ ఇస్తారని డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు కూడా పార్టీకి తనవంతు సాయం చేశారు. ఇటీవల శ్రీనివాసరావుకే టిక్కెట్ అని చెప్పి, నియోజకవర్గంలో పనిచేసుకోమని చెప్పి చంద్రబాబు క్లారిటీ కూడా ఇచ్చారు. కానీ, చివరి నిమిషంలో శ్రీనివాసరావును కాదని రమణమూర్తికి మళ్లీ టిక్కెట్ ఖరారు చేశారు. నమ్మించి మోసగించడం ఎందుకని బగ్గు లక్ష్మణరావు వర్గమంతా బగ్గు మంటోంది.

అచ్చెన్నాయుడ్ని నమ్ముకోవడమే తప్పా..

టీడీపీలో రెండు వర్గాలు నడుస్తున్నాయి. అందులో ఒకటి అచ్చెన్నాయుడు వర్గం. మరొకటి లోకేష్ వర్గం. ఇక్కడ బగ్గు లక్ష్మణరావు వర్గమంతా అచ్చెన్నాయుడిని నమ్ముకుంది. చేతి చమురు కూడా బాగా వదిలించుకుంది. ఇక తనకు శత్రువైన అచ్చెన్నాయుడికి దూరంగా బగ్గు రమణమూర్తి లోకేష్‌ను నమ్ముకున్నారు. ఇటీవల టిక్కెట్ రాదనే ఊహాగానాల నేపథ్యంలో బగ్గు రమణమూర్తి వర్గీయులు కొందరు అచ్చెన్నాయుడు వద్దకు వెళ్లి తమకు సహకరించాలని, టిక్కెట్ వచ్చేలా చూడాలని కోరిన సందర్భంలో తన అవసరం రమణమూర్తికి ఎందుకని, ఆయనకు వేరే నాయకులు ఉన్నారు కదా? అని, అధిష్టానం కూడా తాను చెబితే టిక్కెట్ ఇచ్చే పరిస్థితి లేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో రమణమూర్తి కూడా అచ్చెన్నాయుడికి అంత సీన్ లేదని, ఆయనపై ఆధారపడలేదని, తనకున్న మనుషులు తనకున్నారని తన అనుయాయుల వద్ద చెప్పడం కూడా విన్నాం. ఆ రోజు అచ్చెన్నాయుడు స్పందించినట్టుగానే, రమణమూర్తి చెప్పినట్టుగానే ఇప్పుడు జరిగింది. ఇక్కడ లోకేష్ మాటే చెల్లుబాటు అయ్యింది. అచ్చెన్నాయుడు వెంట నడిచిన వారికి మొండి చేయి తప్పదని తేలిపోయింది. పార్టీలో జరుగుతున్న అంతర్గత విభేదాల నేపథ్యంలో బగ్గు లక్ష్మణరావు, ఆయన కుమారుడు డాక్టర్ శ్రీనివాసరావు బలి పశువులైపోయారు. అచ్చెన్నాయుడ్ని నమ్ముకుని నష్టపోయామని, అధిష్టానానికి చేతనైనంత సాయం చేసి మోసపోయామని బగ్గు లక్ష్మణరావు వర్గీయులు బాధ పడుతున్నారు. బగ్గు రమణమూర్తికి టిక్కెట్ ఖరారు కావడంతో బగ్గు లక్ష్మణరావు వర్గీయులంతా ఆవేదనతో ఉన్నారు. రానున్న ఎన్నికల్లో తన ప్రతాపం చూపిస్తామంటూ సన్నిహితుల వద్ద అంటున్నారు.



మనువుల రేవు

- 16న నువ్వలరేవులో సామూహిక వివాహాలు
- ఒక్కటి కానున్న 62 జంటలు
- మూడు రోజుల పాటు జరగనున్న పెళ్లి వేడుకలు
- వరుడి మెడలో తాళి కట్టే వింత ఆచారం

ఊరు ఊరంతా విద్యుత్ అలంకరణలు జిగేల్‌మనిపిస్తాయి. పల్లెపల్లెంతా పెళ్లి పందిరిలా కనిపిస్తుంది. వివాహ మంత్రాలు సాగర ఘోషతో సమానంగా ప్రతిధ్వనిస్తాయి. పరిణయ వేడుకలు ఆజన్మాంతం గుర్తుండేలా అద్భుత రీతిలో జరుగుతాయి. ఇవన్నీ చూడాలంటే 16న నువ్వల రేవు వెళ్లాలి. ఈ ఒక్క రోజుకు మనువుల రేవులా మారే అపురూప దృశ్యాలను చూసి తీరాలి. జిల్లాలోని అతిపెద్ద మత్స్యకార గ్రామంలో జరిగే పెళ్లి సందడికి ప్రత్యక్ష సాక్షులవ్వాలి.

వజ్రపుకొత్తూరు రూరల్: జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో పెళ్లి సందడి మొదలైంది. శ్రీరామ నవమి వేడుకలకు పెట్టింది పేరయిన ఈ మత్స్యకార పల్లెలో సామూహిక వివాహాలు ఓ ప్రత్యేకత. పదుల సంఖ్యలో జంటలు ఒకే రోజు పెళ్లి చేసుకునే అరుదైన సంప్రదాయం ఈ గ్రామం సొంతం. ఈ నెల 15, 16, 17 తేదీల్లో సామూహిక వివాహాలు జరిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఒకే ముహూర్తానికి సుమారు 62 జంటలు ఒక్కటి కానున్నాయి. ఈ వివాహ తంతులో నవ వరుడి మెడలో నవ వధువు తాళి (బియ్యపు గింజ ఆకారంలో ఉన్న సూత్రం) కట్టే ఆచారం ఉంది. ప్రస్తుతం సుమారు 13 వేల మంది జనాభా ఉన్న గ్రామంలో కేవలం బెహరా, బైనపల్లి, ముువ్వల ఇంటి పేర్లతో 95 శాతం మంది సంప్రదాయ మత్స్యకారులు ఉన్నారు. చేపల వేట ప్రధాన వృత్తిగా జీవనోపాధి సాగిస్తున్న వీరికి.. వివాహాల సమయంలో ఊరంతా విందు పెట్టేందుకు ఆర్థిక భారం అవుతుందని భావించి పూర్వీకులు సామూహిక వివాహాల సంప్రదాయం ప్రవేశపెట్టారు. పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతిని కాపాడుకుంటూ ఇప్పటికీ అదే పద్ధతిలో ఇక్కడ పెళ్లిళ్లు చేసుకుంటున్నారు.



వరుడు(ఫైల్)

మూడు రోజుల పెళ్లి..



గ్రామంలో దాదాపుగా 95 శాతం మంది ఒకే కులానికి చెందిన వారు కావడంతో అదే గ్రామ యువతులతో యువకులకు వివాహాలు జరిపి బంధుత్వాన్ని మరింత పటిష్టం చేసుకుంటారు. పెద్దలు పెళ్లిళ్లు కుదిర్చినా అబ్బాయి, అమ్మాయిల అభీష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రేమ వివాహాలు కూడా జరుగుతుంటాయి. ఈ నెల 15,16,17 తేదీల్లో పెళ్లి జరిపించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. మొదటి రోజు(15వ తేదీ)న గొంటి బంధ, రంగుల హోలీ వేడుకతో వేడుక ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు సందడి సందడిగా జరిగి అప్పగింతలతో వేడుకలు ముగుస్తాయి. ఈ వివాహ తంతులో మొదటి రోజు గొంటి బంధ చెరువు నీటితో స్నానాలు, గ్రామస్తులంతా హోలీ ఆటలు ఆడుతారు. రెండో రోజు అంటే 16వ తేదీ రాత్రి 1.55 నిమిషాలకు వరులకు మాంగళ్య ధారణ జరుగుతుంది. చివరి రోజు అప్పగింతలు ఉంటాయి.



సాముహిక వివాహలకు సిద్ధమైన నువ్వలరేవు గ్రామం

ఆచారం కొనసాగిస్తున్నాం



పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఆచార వ్యవహారాలు, కుల కట్టుబాట్లను గౌరవిస్తున్నాం. గ్రామస్తులంతా కలిసి బృందావతి అమ్మవారి ఆశీస్సులతో సామూహిక వివాహాలను పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నాం. ఒకే సారి ఎక్కువ పెళ్లిళ్లు చేయడంతో తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బంది తప్పుతుంది. - ముువ్వల యజ్ఞా, సర్పంచ్, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం.

పెద్దల మాటే శిరోధార్యం



గ్రామస్తులంతా కలిసి ఏకతాటిగా ఒకే నిర్ణయం తీసుకుంటాం. దీనికి అనుగుణంగానే పెద్దల మాటలను ప్రతి ఒక్కరూ శిరోధార్యంగా భావిస్తారు. మా గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు, సామూహిక వివాహాలు ఎంతో ప్రతిష్టంగా జరుపుతాం. భావితరాలకు సంప్రదాయాలు అందించడమే లక్ష్యంగా ఈ వేడుకలు చేస్తున్నాం. - నీలాంబర్, సొసైటీ అధ్యక్షుడు

సంప్రదాయాలను గౌరవిస్తాం



తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలను గౌరవిస్తాం. గ్రామ కట్టుబాట్లకు కట్టుబడి పెద్దల సమక్షంలో వివాహ ముహూర్తం ఖరారు చేసి అదే ముహూర్తానికి 124 మంది నవ వధూవరులను ఒక్కటి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. - ముువ్వల దేవా, వైస్ సర్పంచ్ నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం

పద్ధతిగా..

తరతరాలుగా సాగుతున్న పద్ధతి ప్రకారమే వివాహ తంతు నిర్వహిస్తారు. గ్రామ దేవత బృందావతి అమ్మవారికి ప్రత్యేక పూజ చేసి వివాహ కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆలయం వద్దకు తెచ్చిన మట్టి కుండలతో చెరువు నీటిని తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు చేస్తారు. అలాగే మిగిలిన నీటితో వధూవరులకు మంగళస్నానాలు చేస్తారు. తర్వాత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కొద్ది సేపు గడిపి వరుడు నల్లటి కళ్లద్దాలు, తలపాగా, మెడలో డబ్బు కట్టలతో పెళ్లి పీటలపై ఆశీనులవుతాడు. మంత్రోచ్ఛరణల నడుమ ముందుగా వధువు మెడలో వరుడు తాళి కడతాడు. అనంతరం పెళ్లి కుమారుడి మెడలో పెళ్లి కుమార్తె కూడా తాళి కడుతుంది.

క్లుప్తంగా

17న సెపక్‌తక్ర జట్టు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా సపక్‌తక్రా పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు అంతర వర్సిటీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ గురువారం వర్సిటీలో నిర్వహించారు. ఐదుగురు క్రీడాకారులను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. వి.ప్రవీణ్ (తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల), జి.లక్ష్మణ్ కుమార్ (కాకినాడ ఆదిత్య శ్రీకాకుళం), బి.నిఖిల్‌దేవ్ (శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల), షణ్ముఖ యోగేష్ (కాకినాడ ఆదిత్య), కె.నిఖిత్‌కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల నరసన్నపేట) పాల్గొన్నారు. కోచ్‌గా జి.అర్జున్ రెడ్డి వ్యవహరిస్తారు. ఎంపికైన క్రీడాకారులను స్పోర్ట్స్ డీన్ యు.కావ్య జ్యోత్స్న, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, భాస్కర్ అభినందించారు.

కిడ్నీ కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం

కాశీబుగ్గ: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో కిడ్నీ పేషెంట్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ రిబ్బన్ కత్తిరించి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిడ్నీ పరిశోధన కేంద్రానికి వచ్చిన వారు ఈ కేంద్రంలో రక్తనమూనాలు అందిస్తే వారు పరిశోధన విభాగానికి పంపిస్తారని అన్నారు. ఇప్పటికే కిడ్నీ వ్యాధికి గురైనవారికి ఆహారపు అలవాట్లు, పూర్తి డైట్ గురించి వివరిస్తారని, ఎలాంటి సలహాలు సూచనలు కావాల్సి ఉన్నా ఈ కేంద్రంలో లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మోహన్ బాబు, నెఫ్రాలజీ డాక్టర్ రాకేష్, డాక్టర్ గుమ్మడి బాలాజీ, డాక్టర్ దిలీప్, ల్యాబ్ టెక్నీషియన్ కర్రి తిరుపతి, ఎంవీ సత్యంనారాయణ, 11 మంది రూరల్ సర్వే స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువత కోసం ఎక్స్‌ట్రీమ్ 125 ఆర్



కొత్తబైక్ తాళాన్ని కొనుగోలుదారునికి అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): టూ వీలర్స్‌లో యూత్ కోసం హీరో మోటో కార్ప్ హీరో ఎక్స్‌ట్రీమ్-125ఆర్ పేరిట సరికొత్త బైక్‌ను మార్కెట్‌లోకి తీసుకురావడం అభినందనీయమని యూట్యూబర్ అరవింద్‌సింగ్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం శ్రీకాకుళం నగరంలో వరం ఆటో సెంటర్ ఎండీ అంధవరపు ప్రసాద్ ఆధ్వర్యంలో బైక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి ముగ్గురు కొనుగోలుదారులకు బైక్ తాళాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. వరం ఆటో సెంటర్ అధినేత అంధవరపు ప్రసాదరావు మాట్లాడుతూ ఆయిల్‌ట్యాంక్ ట్యాంక్ డిజైన్ చూపరులని ఆకట్టుకునేలా ఉందని స్ప్లిట్ స్టైల్ సీట్స్, స్ప్లిట్ గ్రాబ్ రెయిల్స్ వంటివి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వరం ఆటో సెంటర్ జనరల్ మేనేజర్ ఎం.వెంకటరావు, మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటిపల్లి మోహన్‌రావు, డిఎస్ఎమ్ గుణాకర్, మేనేజర్ రాజశేఖర్, సత్యం, పలువురు మెకానిక్ సోదరులు, కస్టమర్లు, వరం ఆటో సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఈబీ అదనపు ఎస్పీ గంగాధర్

శ్రీకాకుళం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ డి.గంగాధర్ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు.



కొత్తూరు: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

సంబరాల చేయూత

జిల్లాలో చేయూత సంబరాలు కొనసాగుతున్నాయి. కొత్తూరు, హిరమండలంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కవిటిలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు మహిళలతో కలిసి క్షీరాభిషేకాలు నిర్వహించారు.



కవిటి : సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ కె.పద్మ

కిడ్నీ ఆస్పత్రి ఓ వరం



పలాస కిడ్నీ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న వైద్యులు, సమీప ప్రాంత పీహెచ్‌సీల వైద్యులు

- ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి
- వ్యాధి మూలలపై ఆస్పత్రిలోనే పరిశోధనలు కొనసాగుతున్నాయి
- ప్రపంచ కిడ్నీ దినోత్సవంలో కిడ్నీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంతో పాటు జిల్లాలో ఉన్న కిడ్నీ బాధితులకు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం ఓ వరం వంటిదని, ఇక్కడి సూపర్‌స్పెషాలిటీ సేవలు వినియోగించుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ అన్నారు. పలాసలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.85కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ కిడ్నీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆస్పత్రికి రోజుకు 90 మంది వరకు ఓపీ కింద వస్తున్నారని, స్థానికులకు ఆస్పత్రి బాగా చేరువవుతోందని అన్నారు. ఇక్కడ అన్ని రకాల సేవలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 23 రకాల మందులు అందిస్తున్నామని, డయాలసిస్ సేవలు సైతం అందిస్తామని, 24 గంటల నెఫ్రాలజీ స్పెషలిస్టు సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. క్రియాటిన్ లెవెల్స్‌ను బట్టి పింఛన్ నమోదు సైతం ఇక్కడే జరుగుతోందని అన్నారు. కిడ్నీ వ్యాధికిగల కారణాలు తెలుసుకునేందుకు జార్జి యూనివర్సిటీతో కలిసి మరో వైపు పరిశోధన సైతం జరుగుతోందని తెలిపారు.

ఒక్కపైసా ఖర్చు కాలేదు



నా వయసు 22 ఏళ్లు. మూత్రం ఆగిపోవడంతో ఇక్కడకు వచ్చాను. ఇక్కడ యూరాలజీ విభాగం ఉంది. వివిధ రకాల పరీక్షలు చేసి నాకు కిడ్నీ ఎలర్జీ ఉందని తెలిపి అందుకు చికిత్స చేసి అబ్జర్వేషన్‌లో పెట్టారు. ఒక్క పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ వైద్యం అందడం సంతోషంగా ఉంది. – అల్లివెల్లి చంద్రశేఖరరావు, సూదికొండ, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఉచితంగా ఆపరేషన్



రైతు కుటుంబానికి చెందిన నాకు మా అల్లుడు ఈ ఆస్పత్రి గురించి చెప్పాడు. దీంతో ఇక్కడకు వచ్చాను. ఏసీ గదిలో ఉంచుతూ ఉచితంగా రూ.లక్ష విలువైన ఆపరేషన్ చేశారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఉన్న నాకు రెండువైపులా హెర్నియా ఆపరేషన్ ఉచితంగా చేశారు. మాలాంటి పేదవారికి ఇలాంటి ఆపరేషన్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి మేము రుణపడి ఉంటాం. – మట్ట అప్పోజి, హెర్నియా ఆపరేషన్ చేసుకున్న వ్యక్తి, సింగుపురం, నందిగాం మండలం

ఉచితంగా సేవలు..



గత ఇరవై ఏళ్లలో చాలా మంది ఇక్కడి నుంచి విశాఖ వరకు వెళ్లి వైద్యం పొందారు. ఇప్పుడు ఇక్కడే అన్ని సేవలు ఉచితంగా లభిస్తున్నాయి. ఏ ప్రాంతం వారయినా ఆస్పత్రికి చేరుకుని వైద్య సేవలు పొందవచ్చును. ప్రతి ఒక్కరూ తమ కిడ్నీల పరిస్థితులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. – డాక్టర్ కూన మోహనబాబు, జనరల్ మెడిసిన్, కిడ్నీ ఆస్పత్రి, పలాస

కిడ్నీ మార్పిడి కూడా జరుగుతుంది



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల పరీక్షలు చేసి వారి పరిస్థితిని బట్టి వారికి వైద్య సేవలు, మందులు, డయాలసిస్ వంటి సేవలు అందిస్తున్నాము. రానున్న రెండు మూడు నెలల్లో కిడ్నీ మార్పిడి చేసే ఆపరేషన్‌లు సైతం ప్రారంభిస్తాం. అందుకు తగిన పరికరాలన్నీ ఉన్నాయి. వ్యాధికి గురైతే జాగ్రత్తలు పాటిస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవచ్చు. – డాక్టర్ రాకేష్, నెఫ్రాలజిస్టు, కిడ్నీ పరిశోధన కేంద్రం, పలాస

అధ్యయనం జరుగుతోంది



కిడ్నీ వ్యాధి మూలాలు తెలుసుకునే అధ్యయనం జరుగుతోంది. జార్జ్ యూనివర్సిటీతో కలిసి ఉద్దాన ప్రాంతంలో నీరు, నేల, కొబ్బరి, జీడి పంటలు నమూనాలు సేకరిస్తున్నాం. మేము కొన్ని సేకరించిన శాంపిల్స్ నాలుగు రకాల పరీక్షలు చేయాల్సి ఉంది. ఇతర దేశాల్లో పరీక్ష చేసి ఫలితాలు రాగానే తెలియజేస్తాం. లక్షమందికిపైగా పరీక్షలు జరపగా 19వేల మంది వరకు వివిధ స్థాయిల్లో కిడ్నీ బాధితులుగా గుర్తించాము. – డాక్టర్ బాలాజీ, కిడ్నీపరిశోధన విభాగ అధిపతి, పలాస.

'ఆర్థిక స్వావలంబన దిశగా సహకార సంఘాలు'

శ్రీకాకుళం అర్బన్: సహకార సంఘాలను ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకువెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన కేంద్రీయ సహకార విధానాన్ని రూపొందించేందుకు కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన వ్యవస్థను సహకార రంగంలోనే దేశీయ స్థాయిలోనే పరిరక్షించాలనే ఆలోచనతో రకరకాల కొత్త పథకాలతో కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల ఆలోచనలు చేసి ఒక డేటా బేస్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

ఇందులో 2,64,000 సహకార సంఘాలు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. నూతన విధానానికి మన రాష్ట్రం అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే తొలిసారిగా నేషనల్ కో ఆపరేటివ్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే మూడు రోజులు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, కమిషనర్ సూచన మేరకు సహకార వ్యవస్థలో ఉండే ముఖ్యంగా బలహీనంగా ఉన్న సహకార సంఘాలను ఎంపిక చేసి వాటిని బలోపేతం చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త అవసరం



ఫేక్ ట్రేడింగ్ యాప్

శ్రీకాకుళం క్రైమ్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని జాగ్రత్త వహించాలన్నారు. ఈ నేరగాళ్ల పద్ధతులపై జిల్లా ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి అనేక రకమైన సామాజిక మాధ్యమాలను వాడే యూజర్లను టార్గెట్ చేసుకుంటాని, స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని, నమ్మకం కోసం కొందరి పేర్లు, ఫోన్ నంబర్లు ఇచ్చి మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తారని, అవతల లాభపడ్డామని చెప్పే వ్యక్తి నేరగాళ్లలో ఒకడిగా ఉంటాడని, అందుకే అలాంటి తప్పుడు ప్రకటనలు నమ్మవద్దన్నారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల కోసం వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ట్రేడింగ్‌కు సంబంధించి తప్పుడు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుబడులు పెట్టవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే సైబర్ హెల్ప్‌లైన్ నంబరు 1930కి కాల్ చేయాలని లేదని సైబర్ క్రైమ్ డాట్ జీవోవి డాట్ ఇన్ లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అమ్మకు సారీ చెప్పి..

- బీటెక్ విద్యార్థి ఆత్మహత్య
- వైజాగ్ గీతంలో చదువుతున్న జశ్వంత్
- స్థానిక ప్రశాంత నగర్‌లో విషాదం



ఇంజినీరింగ్ విద్యార్థి జశ్వంత్ (ఫైల్)

నరసన్నపేట: రోజూ సాయంత్రం అమ్మతో ఇష్టంగా మాట్లాడే బిడ్డ ఆ రోజు సాయంత్రం ఫోన్ చేయలేదు. ఏ బాధ వచ్చినా తల్లితో పంచుకునే ఆ కొడుకు ఆ సాయంత్రం వేళ మాత్రం 'సారీ' అన్న సందేశమే పంపించాడు. అమ్మను క్షమించమని కోరి ఆ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చి అనంతలోకాలకు వెళ్లిపోయాడు. నరసన్నపేట ప్రశాంత నగర్‌కు చెందిన కాశిన జశ్వంత్(20) విశాఖలో ఆత్మహత్యకు పాల్పడడంతో స్థానికంగా విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. స్థానిక ప్రశాంత నగర్‌కు చెందిన కాశిన రమేష్, సంధ్యల కుమారుడు జశ్వంత్. విశాఖ గీతంలో ఇంజినీరింగ్ ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఇంటికి వచ్చి ఆదివారం వరకూ ఇక్కడే అందరితో సరదాగా గడిపి సోమవారం కాలేజీకి వెళ్లాడు. బుధవారం ఉదయం ఫోన్ చేసి తల్లితో మాట్లాడాడు. సాయంత్రం కూడా రోజూ ఫోన్ చేసి మాట్లాడుతుంటాడు. కానీ బుధవారం సాయంత్రం మాత్రం ఫోన్ కాల్ బదులు అమ్మా.. సారీ అని మేసేజ్ వచ్చింది. తల్లి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో రూమ్‌మేట్‌కు ఫోన్ చేసి కొడుకు రూమ్ వద్దకు వెళ్లమని ఆమె కోరారు. అక్కడకు కొద్ది సమయానికే జశ్వంత్‌కు సీరియస్‌గా ఉంది అని కళాశాల యాజమాన్యం నుంచి సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖ వెళ్లారు. అప్పటికే జశ్వంత్ మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యార్థి తండ్రి రమేష్ మాట్లాడుతూ మా అబ్బాయి అంత పిరికివాడు కాదని, మాకు అనేక సందర్భాల్లో ధైర్యం చెప్పే వాడని, ఆత్మహత్యకు పాల్పడే మనస్తత్వం కాదని అన్నారు. మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 5 గంటలకు విశాఖ నుంచి మృతదేహం రాగా అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు.

2529 మందికి రూ.3.79 కోట్లు



లబ్ధిదారుకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన 2529 మందికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రూ.3.79 కోట్లు విడుదల చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం అనంతరం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ లబ్ధిదారులకు ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును అందజేశారు.

- రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వెలమ ఇతర ఓసీ కులాలకు చెందిన (ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనారిటీల వారికి కాకుండా) 45–60 ఏళ్ల పేద మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఏటా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. దీనికింద 2021–22 సంవత్సరంలో 2353 మందికి, 2022–23 లో 2632 మందికి అందజేశారు.

కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఈడీ గెడ్డమ్మ, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, టి.కామేశ్వరి, పలువురు అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గతంలో ఎవరూ పట్టించుకోలేదు



అగ్రవర్ణ పేద మహిళలను గతంలో ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక మేనిఫెస్టోలో లేకపోయినా మాకు మేలు చేసే పథకాన్ని తీసుకువచ్చారు. అగ్రవర్ణ పేద మహిళలు వ్యాపారాలు చేసుకుని కష్టాలను దాటడం చూస్తుంటే ఆనందంగా ఉంది. మాకు అమ్మఒడి, విద్యాదీవెన, డ్వాక్రా రుణమాఫీ, ఇళ్లస్థలాలు వంటివి అందజేసిన సీఎం వైఎస్ జగన్ మరో 30 ఏళ్లు ఉండాలని కోరుతున్నాం. – టి.కామేశ్వరి, రాష్ట్ర మహిళా కార్యదర్శి



ఈ ఏడాదికి గాను గురువారం 2529 మందికి రూ.379.35 లక్షలను విడుదల చేశారు

నియోజకవర్గం	ఆమదాలవలస	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం	నరసన్నపేట	పలాస	పాతపట్నం	శ్రీకాకుళం	టెక్కలి
లబ్ధిదారులు	172	369	597	129	390	325	386	161
నగదు (రూ.లక్షల్లో)	25.80	55.35	89.55	19.35	58.50	48.75	57.90	24.15

ఇసుక ర్యాంపుల పరిశీలన



వంశధార నది అంగూరు వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న జాతీయ హరిత ట్రిబ్యునల్ బృందం

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామం వంశధార నదిలోని మాతల–నివగాం బ్రిడ్జి వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేసినట్లు గత ఏడాది ఆగస్టులో జాతీయ హరిత బృందానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జాతీయ హరిత బృందం సభ్యురాలు సౌమ్య ఆధ్వర్యంలో నివగాం, అంగూరు గ్రామాల వద్ద ఇసుక ర్యాంపులను గురువారం పరిశీలించారు. నివగాం వద్ద గోతులు వరదలకు పూడ్చుకు పోయాయి. అంగూరు వద్ద ప్రస్తుతం ఇసుక తవ్వకాలను పరిశీలించారు. నివేదికలను ప్రభుత్వంతో పాటు ఫిర్యాదు దారులకు అందిస్తామని ట్రిబ్యునల్ సభ్యులు తెలిపారు. బృందంతోపాటు బీఆర్వో గణపతి, పొల్యూషన్ బోర్డు ఈఈ రామారావు నాయుడు, ఇరిగేషన్ ఏఈ ప్రసాదరావు, డీటీ సత్యనారాయణ ఉన్నారు.

ఏసీబీ వలలో సాబకోట ఇంజినీరింగ్ అసిస్టెంట్



రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన సాబకోట ఇంజినీరింగ్ అసిస్టెంట్ సవర లోకనాథం

మందస: మండలంలోని గిరిజన ప్రాంతమైన సాబకోట సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ సవర లోకనాథం యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులకు గురువారం పట్టుబడ్డాడు. జగనన్న కాలనీ బిల్లులకు సంబంధించి ఓ గిరిజనుడి నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారు అందించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని సాబకోట పంచాయతీ సింగుపురం గ్రామానికి చెందిన గిరిజనుడు నిమ్మన పరశురాంనకు జగనన్న కాలనీ ఇళ్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం చేస్తున్న పరశురాం బిల్లు పెట్టాలని కోరగా, ఉద్యోగి లంచం అడిగాడు. దీంతో లబ్ధిదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు రమణమూర్తి, సీఐలు ఈశ్వరరావు, రమణల ఆధ్వర్యంలో పక్కాగా ప్లాన్ చేసి ఉద్యోగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. లోకనాథం ఇదే మండలంలోని చీపి పంచాయతీ లొడకపిట్ట గ్రామానికి చెందిన వారు. ఓ గిరిజనుడి నుంచి మరో గిరిజనుడు లంచం తీసుకోవడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లోకనాథాన్ని అరెస్ట్ చేసి, రిమాండ్ తరలించారు.

తండ్రిని కోల్పోయిన దుఃఖంలోనూ..



పరీక్ష కేంద్రం వద్ద జయలక్ష్మి

నరసన్నపేట: మండలంలోని కిల్లాంకు చెందిన అలివి జయలక్ష్మి పుట్టెడు దుఃఖంలోనూ ఇంటర్ పరీక్షకు హాజరైంది. జయలక్ష్మి తండ్రి అలివి ఆదినారాయణ బుధవారం ఒడిశాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఆయన మృతదేహం ఇంటికి గురువారం వస్తుందని తెలిసినా జయలక్ష్మి బాధను పంటి బిగువన భరించి పరీక్ష రాసేందుకు వెళ్లింది. అంపోలులో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్న జయలక్ష్మి గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం చివరి పరీక్ష కెమిస్ట్రీ రాసింది. శ్రీకాకుళం చైతన్య కళాశాల సెంటర్‌లో పరీక్షకు హాజరైంది. ఒడిశాలో రోడ్డు ప్రమాదం జరిగాక పోస్టుమార్టం చేసి గురువారం ఉదయం 10 గంటలకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. జయలక్ష్మి పరీక్ష రాసి తిరిగి వచ్చే వరకూ మృతదేహం శ్మశానంలో ఉంచారు. ఆమె పరీక్ష రాసి వచ్చి తండ్రి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. అంతదుఃఖంలోనూ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థినిని అంతా అభినందించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.